## కలెక్టర్‌కు పుట్టిన రోజు శుభాకాంక్షలు



కలెక్టర్ వెంకటేశ్‌ధోత్రేకి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, నవంబర్ 30 : జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో శనివారం కలెక్టర్ వెంకటేశ్ ధోత్రేకు ఎమ్మెల్యే కోవ లక్ష్మి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్, సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్ ఉన్నారు.

### కలెక్టర్ దంపతుల పూజలు

పుట్టిన రోజును పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని హనుమాన్ ఆలయంలో కలెక్టర్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు.

## సమష్టి కృషితో లక్ష్యాలను అధిగమించాలి



మాట్లాడుతున్న మందమర్రి జీఎం దేవేందర్

మందమర్రి, నవంబర్ 30 : సింగరేణి మందమర్రి ఏరియాలోని అన్ని విభాగాల అధికారులు, ఉద్యోగులు సమష్టి కృషితో ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించాలని ఏరియా జీఎం జీ.దేవేందర్ కోరారు. మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగులు సక్రమంగా విధులకు హాజరు కావడం లేదని, రాత్రి షిఫ్టుల్లో అయితే గైర్హాజరు శాతం ఎక్కువగా ఉంటుందన్నారు. గైర్హాజరు శాతాన్ని తగ్గించేందుకు కృషి చేయాలని ఆయన అధికారులకు సూచించారు. నవంబర్‌లో ఏరియా 60 శాతం ఉత్పత్తిని సాధించిందని, నిర్ధేశిత లక్ష్యం 3,12,500 టన్నులు కాగా, 1,88,975 టన్నుల ఉత్పత్తిని సాధించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో డీజీఎం(ఈఅండ్ఎం) వెంకటరమణ, డీజీఎం(ఐఈడీ) రాజన్న, ఏరియా పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, సివిల్ ఎస్ఈ రాము, డీవైపీఎం ఆసీఫ్ పాల్గొన్నారు.

# హడలెత్తిస్తున్న పులి



**గన్నారం ఘటన నుంచి తేరుకోక ముందే మరో రైతుపై దాడి**

- దుబ్బగూడ సమీపంలోని చేనులో పనిచేస్తుండగా పంజా
- గొడ్డలితో తిరగబడడంతో పారిపోయిన టైగర్
- తీవ్రంగా గాయపడ్డ సురేశ్
- మంచిర్యాలకు తరలింపు
- ముందస్తు సమాచారం ఇచ్చినా పట్టించుకోని అధికారులు



కౌటాల : పులి దాడిలో గాయపడిన సురేశ్‌ను సిర్పూర్ దవాఖానకు తరలిస్తున్న స్థానికులు



కౌటాల : పులి దాడిలో గాయపడ్డ సురేశ్



శుక్రవారం పులిదాడిలో మృతిచెందిన మోర్ల లక్ష్మి



పులిజాడ కోసం డ్రోన్ ఎగురవేస్తున్న సిబ్బంది

**కాగజ్‌నగర్ డివిజన్‌లో సంచరిస్తున్న పులి ప్రజలను హడలెత్తిస్తున్నది. శుక్రవారం గన్నారం సమీపంలో పత్తి ఏరుతున్న మోర్ల లక్ష్మిపై దాడి చేసి చంపగా, ఆ ఘటన నుంచి తేరుకోకముందే శనివారం సిర్పూర్-టీ మండలం దుబ్బ గూడలో రైతు సురేశ్‌పై పంజా విసిరింది. ఆ యువకుడు తన చేతిలోని గొడ్డలితో పులిపై ఎదురు దాడికి దిగడంతో అది అక్కడి నుంచి పారిపోయింది. తీవ్రంగా గాయపడ్డ రైతును కాగజ్‌నగర్‌కు తరలించి అక్కడి నుంచి మంచిర్యాలకు తీసుకెళ్లారు.**

*- కుమ్రం భీం ఆసిఫాబాద్, (నమస్తే తెలంగాణ) / కౌటాల / ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్/ కాగజ్‌నగర్, నవంబర్ 30*

### పత్తి చేనుకు వెళ్లగా..

దుబ్బగూడకు చెందిన సురేశ్, అతడి భార్య సుజాత శనివారం మధ్యాహ్నం సమీపంలోని పత్తి చేనుకు వెళ్లారు. ఇద్దరు కలిసి పత్తి తీస్తుండగా, పొదల్లో శబ్ధం వినిపించింది. అడవి పందులు కావచ్చని చెదరగొట్టేందుకు సురేశ్ ఆ వైపు వెళ్లాడు. పొదల్లో రెండు పులులున్నాయని, అందులోని ఒక పులి సురేశ్‌పై దాడి చేసిందని ప్రత్యక్ష సాక్షి అయిన సుజాత ద్వారా తెలిసింది. సురేశ్‌పై పులి దాడి చేస్తున్నట్లు గమనించిన సుజాత కేకలు వేస్తూ.. అక్కడికి వెళ్లి కర్రలు.. రాళ్లతో పులిని కొట్టే ప్రయత్నం చేసింది. అప్పటికే సురేశ్ మెడపై దాడి చేసిన పులి అతడిని కొంత దూరం లాక్కెళ్లింది. సురేశ్ కూడా గొడ్డలితో ఎదురుదాడి చేయడం.. అదే సమయంలో చుట్టు పక్క రైతులు, కూలీలు అక్కడికి రావడంతో పులి సురేశ్‌ను వదిలేసి పారిపోయింది. తీవ్రంగా గాయపడ్డ సురేశ్‌ను హుటాహుటిన సిర్పూర్–టీ దవాఖానకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం కాగజ్‌నగర్‌లోని దవాఖానకు ..అక్కడి నుంచి మంచిర్యాలకు తరలించారు.

### వరుస ఘటనలతో భయాందోళనలు

కాగజ్‌నగర్ డివిజన్‌లో పులుల దాడి ఘటనలు ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నాయి. శుక్రవారం గన్నారంలో మోర్లె లక్ష్మిపై పులి దాడి చేసి చంపే వరకూ అటవీ అధికారులు దాని జాడ గుర్తించలేకపోయారు. గన్నారంలో ఘటన జరిగిన తర్వాత కూడా పులి సంచారాన్ని గుర్తించడంలో అటవీ అధికారులు విఫలమయ్యారనే ఆరోపణలున్నాయి. శనివారం ఉదయం సిర్పూర్ మండలంలోని పెద్ద బండ, దుబ్బగూడ ప్రాంతాల్లో పులిని చూసిన కొంత మంది అటవీ అధికారులకు సమాచారం ఇచ్చినప్పటికీ వారు ప్రజలను అప్రమత్తం చేసేందుకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. వారం క్రితం వరకు కెరమెరి, వాంకిడి, జైనూర్, తిర్యాణి మండలాల్లో సంచరించిన పులి పశువులపై దాడి చేసింది. వాంకిడి మండలంలోని మహారాష్ట్ర బార్డర్ హైవే పక్కన సంచరించిన పులి ఎక్కడికి వెళ్లిందో అధికారులు ఇప్పటి వరకు ట్రాక్‌చేయలేకపోయారు. రెండు రోజులుగా కాగజ్‌నగర్ డివిజన్‌లోని గన్నారం, దుబ్బగూడ ప్రాంతాల్లో తిరుగుతూ రైతులు, కూలీలపై పంజా విసురుతున్నా అధికారులు గుర్తించలేకపోతున్నారు. సంతానోత్పత్తి సీజన్ కావడంతో ఆడ పులి కోసం మగ పులులు వలస వస్తాయని అటవీ అధికారులకు తెలిసినప్పటికీ ఆ దిశగా చర్యలు తీసుకోలేదన్న వాదనలు వినిపిస్తున్నాయి.

### డ్రోన్ సాయంతో జల్లెడ

కాగజ్‌నగర్ కారిడార్‌లో పెద్దపులి హల్‌చల్ చేస్తున్నది. మనుషులపై దాడులు చేస్తూ కంటిమీదకునుకు లేకుండా చేస్తున్నది. ఈ క్రమంలో అటవీ అధికారులు ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు అటవీ ప్రాంతాలో 144 సెక్షన్ అమలు చేశారు. దుర్గానగర్, గన్నారం, విలేజ్ నంబర్ 6, 10, 11, 9 తదితర అటవీ ప్రాంతాల్లో శనివారం వేకువ జాము నుంచే డ్రోన్ సాయంతో అడవులను జల్లెడ పట్టారు. వైల్డ్ లైఫ్ ట్రాకర్, 40 మంది సిబ్బంది ఆరు బృందాలుగా విడిపోయి గాలింపు చర్యలు చేపడుతున్నారు. పులి ఆచూకీ లభించకపోగా సిర్పూర్ (టీ) మండల అటవీ ప్రాంతానికి పెద్ద పులి వెళినట్లు అటవీ శాఖ అధికారులు గుర్తించారు.

### ఎస్-10, కే-8 పులులతో పాటు కొత్తది!

కాగజ్‌నగర్ అటవీ ప్రాంతంలో రెండు పులులున్నట్లు గుర్తించినప్పటికీ ఇటీవల మూడో పులి ప్రవేశించినట్లు తెలిసింది. దాడులు చేస్తున్నది కొత్తపులి కావచ్చని భావిస్తున్నారు. సిర్పూర్ (టీ)అటవీ ప్రాంతంలో ఎస్–10 ఆడ పులి సంచరిస్తున్నట్లు తెలుస్తున్నది. కాగజ్‌నగర్, సిర్పూర్.. మహారాష్ట్ర అటవీ ప్రాంతాలకు పులి రాకపోకలు సాగిస్తున్నట్లు యానిమల్స్ ట్రాకర్స్ స్పష్టం చేస్తున్నారు. ఇకా కే–10 మగ పెద్ద పులి బెజ్జూర్, పెంచికలపేట్ మండలాల అటవీ ప్రాంతంలో సంచరిస్తున్నట్లు వారు గుర్తించారు.

### చేలల్లోనే తెల్లబంగారం

జిల్లాల్లో కూలీలు దొరకక చేలల్లోనే తెల్లబంగారం ఉండిపోతున్నది. దీనికి తోడు పులి అలజడితో కూలీలు భయపడిపోతున్నారు. గతేడాది మహారాష్ట్ర, రాజస్థాన్ రాష్ట్రాల నుంచి కూలీలు వచ్చినా.. ఈసారి మహారాష్ట్రలో ఎన్నికలుండడం వల్ల తక్కువ మంది వచ్చారు. ఒకవేళ ఏరడానికి ముందు కొచ్చినా కిలోకు రూ. 12 ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

### నా కళ్ల ముందే దాడి చేసింది

ఎప్పటిలాగే ఈ రోజు కూడా పత్తి ఏరడానికి పోయిన. నా భర్త కంటే ముందే నేను వెళ్లిన. ఆ తర్వాత ఆయన ఎడ్ల బండితో వచ్చిండు. నేను ఓ దిక్కు పత్తి ఏరుతున్న. చేను వద్దకు చేరుకున్న భర్త సురేశ్‌పై నా కళ్లముందే పులి దాడి చేసింది. వెంటనే కేకలు వేసిన. నా భర్త చేతిలో ఉన్న గొడ్డలితో పులిపై దాడిచేసిండు. దీంతో పులి అడవిలోకి పారిపోయింది. వెంటనే మా బంధువులకు ఫోన్ చేసి చెప్పిన. నా భర్త సురేశ్‌ను తీసుకొని కొద్ది దూరం నడిచిన.. మా బంధువులు వచ్చి దవాఖానకు తీసుకెళ్లారు. *- సురేశ్ భార్య సుజాత*



ఏరియా జీఎం శ్రీనివాస్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

## స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పించాలి

- గోలేటి ఓసీపీని త్వరగా ప్రారంభించాలి
- ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

రెబ్బెన, నవంబర్ 30 : బెల్లంపల్లి ఏరియాలోని ప్రైవేట్ కంపెనీల్లో స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి కోరారు. బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి జీఎం కార్యాలయంలో ఏరియా జీఎం శ్రీనివాస్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పలు విషయాలపై చర్చించారు. సింగరేణి ఆధ్వర్యంలో చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు, ఆర్అండ్ఆర్ కాలనీల్లో సౌకర్యాల గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఏరియా ఎస్వోటూ జీఎం రాజమల్లు, ఏరియా సెక్యూరిటీ అధికారి ఉమాకాంత్, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, మేనేజర్ మహేశ్ ఉన్నారు.

### ఓసీపీని త్వరగా ప్రారంభించాలి

బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి ఓపెన్ కాస్ట్‌ను త్వరగా ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి కోరారు. బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి జీఎం కార్యాలయంలో ఏరియా జీఎం శ్రీనివాస్‌తో సమావేశమయ్యారు. ఓసీపీకి సంబంధించిన పలు విషయాలపై చర్చించారు. అటవీ అనుమతులు రాకపోవడంతో ఓపెన్ కాస్ట్ ప్రారంభం ఆలస్యమవుతుందని సింగరేణి జీఎం తన దృష్టికి తీసుకొచ్చారని, త్వరలో అటవీ అధికారులతో కూడా చర్చిస్తానని, అసెంబ్లీ సమావేశాల్లోనూ ఈ అంశంపై మాట్లాడుతానని కోవ లక్ష్మి పేర్కొన్నారు. ఏరియాలోని గోలేటి, ఎంవీకే ఓసీపీలు ప్రారంభమైతే కార్మికుల సంఖ్య పెరగడంతో పాటు స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాసరావు, ఏరియా కార్యదర్శి మారిన వెంకటేశ్వర్లు, మాజీ జడ్పీటీసీ అజ్మీరా బాబురావు, మాజీ సర్పంచ్ పోటు సుమలత, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పోటు శ్రీధర్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ బొమ్మినేని శ్రీధర్, పందిర్ల మధునయ్య ఉన్నారు.

## మాలల సింహగర్జనతో నేతకానీలకు సంబంధం లేదు

- ఆ సభకు కులస్తులెవ్వరూ వెళ్లవద్దు
- అనుమతి లేకుండానే ఫ్లెక్సీలో మా ఫొటోలు వాడుకున్నరు
- వివేక్ తన స్వలాభం కోసం ప్రభుత్వాన్ని.. ప్రజలను తప్పదోవ పట్టిస్తున్నడు
- బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య



మంచిర్యాలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

మంచిర్యాల టౌన్, నవంబర్ 30 : నేడు హైదరాబాద్‌లో నిర్వహించే మాలల సింహగర్జన సభకు, నేతకానీలకు ఎలాంటి సంబంధం లేదని, ఆ సభకు కులస్తులెవ్వరూ వెళ్లవద్దని బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య స్పష్టం చేశారు. శనివారం మంచిర్యాలలోని నేతకాని భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నేతకాని మహార్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం రాజేశ్‌తో కలిసి మాట్లాడారు. మాలల సింహగర్జన సందర్భంగా రూపొందించిన ఫ్లెక్సీలో తనతో పాటు మాజీ ఎంపీ వెంకటేశ్ నేత ఫొటోను అనుమతి లేకుండా ముద్రించారని తెలిపారు. చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ ప్రభుత్వానికి, ప్రజలకు తప్పుడు సంకేతాన్ని అందించాలని చూస్తున్నారన్నారు. మాలల ఉపకులాలన్నీ ఒక్కటే అని చూపించి.. రాష్ట్రంలో 30 లక్షలకు పైగా తమ జనాభా ఉందని చెప్పి మంత్రిపదవిని చేజిక్కించుకోవాలని చూస్తున్నారని, వారి స్వలాభం కోసం మాలల్లో ఉన్న ఉపకులాలను వాడుకుంటున్నారని మండిపడ్డారు. నిజంగా మాలల మీద ప్రేమ ఉంటే కాకా కుటుంబంలో కాకుండా ఇతర కుటుంబాలకు చెందిన వారిని చట్టసభల్లోకి తీసుకురావాలని కోరారు. ఈ ప్రాంతంలో ఉన్న ఎస్సీ నియోజకవర్గాల్లో కాకా కుటుంబమే పోటీ చేస్తుందని, రిజర్వేషన్ అంటే గడ్డం కుటుంబమే అన్నట్లు వ్యవహరిస్తున్నారని, పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఏ ఒక్క ఎస్సీ నాయకుడిని ఎదగకుండా వీరు అడ్డు పడుతున్నారని ఆరోపించారు. నేతకాని అనేది ఉపకులం అని, మాలలు 30 లక్షల మంది ఉన్నట్లు చెబుతున్నారని, కానీ అందులో నేతకానీలు 18 లక్షల మంది ఉన్నారని చెప్పారు. తాము నిజమైన అంబేద్కర్ వారసులమని చెప్పుకొచ్చారు. నేతకాని కులస్తులు వారి మాటలు నమ్మి మోసపోవద్దని, చిన్నచిన్న పదవులు ఇచ్చి మోసం చేసేందుకు వివేక్ ప్రయత్నిస్తున్నారని తెలిపారు. నేతకాని కులానికి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం న్యాయం చేయాలంటే ఎమ్మెల్సీ లేక రాజ్యసభ పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు. చట్ట సభల్లో నేతకానీలకు ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో నేతకాని మహార్ సంక్షేమ సంఘం స్టీరింగ్ కమిటీ చైర్మన్ దుర్గం నర్సయ్య, పొలిట్‌బ్యూరో చైర్మన్ సెగ్యం రాజేశ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కామెర ప్రకాశ్, అధికార ప్రతినిధి గోళ్ల రాయమల్లు, రాష్ట్ర యూత్ అధ్యక్షుడు అనపర్తి యువరాజు, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు సునార్కర్ రాంబాబు, నేతకాని స్టూడెంట్ ఫెడరేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ గోపాల్, మంచిర్యాల జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు కామెర అనూష, నాయకులు దుర్గం నగేశ్, కామెర శ్రీనివాస్, కొండగొర్ల శ్రీనివాస్, దుర్గం విశ్వనాధ్, సంతోష్, జుమ్మిడి లక్ష్మి, బెంబడి దుర్గయ్య పాల్గొన్నారు.



సిబ్బందికి నియామక ఉత్తర్వులను అందజేస్తున్న సీపీ శ్రీనివాస్

## సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కోవాలి

- రామగుండం కమిషనర్ శ్రీనివాస్
- నూతనంగా ఎంపికైన కానిస్టేబుళ్లకు నియామక ఉత్తర్వులు అందజేత

మంచిర్యాల అర్బన్, నవంబర్ 30 : పోలీసులు అంకిత భావంతో పని చేయాలని, సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కొని ముందుకు సాగాలని రామగుండం కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. శనివారం రామగుండం కమిషనరేట్ కార్యాలయంలో శిక్షణ పూర్తి చేసుకొని వచ్చిన 392 మంది కానిస్టేబుళ్లకు నియామక ఉత్తర్వులు అందజేశారు. సీపీ మాట్లాడుతూ అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తూ అప్పగించిన పనులను సక్రమంగా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ డీవీ శ్రీనివాస్ రావు

## అంకిత భావంతో పనిచేయాలి

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, నవంబర్ 30 : అంకితభావంతో సేవలందిస్తూ ఉన్నత స్థాయికి చేరాలని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. శనివారం తన కార్యాలయంలో బేసిక్ శిక్షణ పూర్తి చేసుకున్న సివిల్, ఏఆర్ పోలీసులతో సమావేశం నిర్వహించారు. అదనపు ఎస్పీ అడ్మిన్ ప్రభాకర్ రావు, డీఎస్పీలు కరుణాకర్‌రామానుజన్, ఖాజా మొయినుద్దీన్, ఎస్బీ సీఐ రాణాప్రతాప్, ఆర్ఐ పెద్దయ్య, ఏవో శ్రీనివాస్, సీఐలు, ఎస్ఐలు ఉన్నారు.

### కేసుల విచారణలో జాప్యం వద్దు

కేసుల విచారణలో జాప్యం చేస్తే సహించేది లేదని ఎస్పీ శ్రీనివాస్ రావు హెచ్చరించారు. శనివారం జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో నెల వారీ నేర సమీక్ష నిర్వహించారు. ఇక శాంతిభద్రత దృష్ట్యా నేటి నుంచి 31వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా పోలీస్ 30 యాక్ట్ అమలులో ఉంటుందని, మహిళలు, చిన్న పిల్లల రక్షణకు మొదటి ప్రాధాన్యం ఉంటుందని వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు.



రాస్తారోకో చేస్తున్న కూరగాయల వ్యాపారులు

## కూరగాయల వ్యాపారుల రాస్తారోకో

బెల్లంపల్లి, నవంబర్ 30 : రోడ్లపై కూరగాయల విక్రయాలను నిరసిస్తూ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ వ్యాపారులు ఆందోళన చేపట్టారు. శనివారం బెల్లంపల్లిలోని కాంటా చౌరస్తా వద్ద రాస్తారోకో నిర్వహించారు. కొందరు రోడ్లపై వ్యాపారాలు చేసుకోవడం వల్ల మార్కెట్ భవనంలోకి కొనుగోలు దారులు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు గిరాకీలు లేక ఆర్థికంగా నష్టపోతున్నామని, నెలసరి అద్దె కూడా చెల్లించలేని పరిస్థితి ఉందని, తమ కుటుంబాలను ఎలా పోషించాలని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాస్తారోకోతో ఇరువైపులా వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. వన్‌టౌన్ పోలీసులు వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. తాము కూడా రోడ్లపైనే విక్రయిస్తామని తెలిపారు. రోడ్లపై విక్రయాలు జరగకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

## కంకలమ్మ జాతర నేడే..

- కాకతీయుల పాలనకు సాక్ష్యంగా ఆలయం
- దేశంలో మహేంద్రుల ఏకైక పుణ్యక్షేత్రం





జాతర ఉత్సవాలకు ముస్తాబైన కంకలమ్మ ఆలయ ప్రాంగణం, కొలువు తీరిన అమ్మవారు

కౌటాల, నవంబర్ 30 : మండల కేంద్రంలో కొలువైన స్వయంభూ కంకలమ్మ–కేతేశ్వర అమ్మవారి జాతరకు వేళయ్యింది. యేటా కార్తీక మాసం చివరి ఆదివారం కంకలమ్మ అమ్మవారి మహాజాతర ఉత్సవాలు నిర్వహిస్తుండగా, తెలంగాణతో పాటు మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. అమ్మవారి ఆలయానికి 6 కిలో మీటర్ల దూరంలో వార్ధా, 13 కిలోమీటర్ల దూరంలోప్రాణహిత నదులు ఉండగా, భక్తులు పుణ్య స్నానాలు ఆచరించి.. ఆపై అమ్మవారికి పూజలు చేస్తారు. నేడు జరిగే ఉత్సవాలకు వచ్చే భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ వ్యవస్థాపకుడు సులువ కనకయ్య తెలిపారు.

### కాకతీయుల పాలనకు సాక్ష్యంగా ఆలయం

కంకలమ్మ ఆలయం కాకతీయుల పాలనకు సజీవ సాక్ష్యంగా నిలుస్తున్నది. భారతదేశంలోనే మేదరు(మహేంద్రుల)ల ఆరాధ్య దైవంగా ఉన్న ఏకైక ఆలయం ఇది. వందల ఏళ్ల క్రితం డంగుసున్నంతో భారీ రాతి దిమ్మెలతో ఆలయాన్ని నిర్మించినట్లు అవగతమవుతున్నది. మధ్య యుగంలో ఇక్కడి దేవాలయాలు, విగ్రహాలను కొందరు ముష్కరులు ధ్వంసం చేసినట్లుగా పూర్వీకులు చెబుతారు. కౌటాల క్షేత్రంలో అక్కడక్కడా పొలాల గట్ల పైన వినాయకుడు, కుమార స్వామి, నంది, శృంగి, భృంగి, బ్రహ్మ, విష్ణు మొదలగు దేవతల విగ్ర హాలు శిథిలావస్థలో కనిపిస్తాయి. గుట్టపై ఆలయం ముందు పెద్ద నీటి కొలను ఉంది.

### ఆలయ పునర్నిర్మాణం

కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన సుల్వ కనకయ్య–కల్యాణి దంపతుల సాయంతో శ్రీ కంకలమ్మ కేతేశ్వర ఆలయ పునర్నిర్మాణం చేపట్టారు. 17-03-2008 సోమవారం రోజున వేదపండితులు మహా గణపతి, నవగ్రహ రుద్రహోమములు నిర్వహించి పనులు ప్రారంభించారు. 13-11-2009న వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య కంకలమ్మ దేవి, కేతేశ్వర స్వామి, విఘ్నేశ్వరుడు, ధ్వజ స్తంభములు, నవగ్రహాలు, నాగదేవత విగ్రహాలకు ప్రతిష్ఠాపన చేశారు.